
# సేవా ప్రతీకం

మీర్ మహిది అలి



మధ్యాహ్నం దాటుతోంది.

గ్రీష్మకాలపు భాస్కరుడి ప్రతాపం ఎండలోనే కాదు గాలిలో కూడ కనిపిస్తూ ఉంది.

పోలీసు స్టేషన్ సెంట్రీ డ్యూటీ చేస్తున్న ప్రభాకర్ మరోసారి భారంగా నిట్టూరుస్తూ ఆమె వైపు చూసాడు. ఎప్పటిలాగే అతని కళ్ళలో ఆమె పట్ల సానుభూతి, ఆమెకు సహాయం చేయలేకపోతున్నందుకు ఒక విధమైన నిస్సహాయత తొణికిసలాడింది.

అతనికి కొద్ది దూరంలో పాత కుర్చీలో ఆమె కూర్చోని ఉంది. ఆమె ఒళ్ళో ఆర్నెల్ల పసిపాప ఆక లికో, అలవాటుకో బొటనవేలు నోట్లో పెట్టుకొని చప్పరిస్తూ నిద్రపోతూ ఉంది.

ఆమె కాసేపు భయంగా పాప మొఖంలోకి, కాసేపు ఆశగా ఇన్‌స్పెక్టర్ గదివైపు చూస్తూ ఉంది. పాప నిద్రలోంచి లేచి ఏడిస్తే ఎవరైన చిరాకు పడ తారేమో అనే భయంతో పాటూ, పాప కంటే ముందు ఇన్‌స్పెక్టర్ నిద్రలేచి తనను పిలుస్తాడేమో నన్న ఆశ కూడ ఆమె కళ్ళలో కదలాడుతూ ఉంది.

పోలీసు స్టేషన్ ఆవరణలోని చెట్లకింద ఆడు కుంటున్న ఆమె మూడేళ్ళ కొడుకు మధ్యమధ్యలో వచ్చి 'అమ్మా వెళదాం పదా' అంటూ అభ్యర్థనగా చెబుతున్నాడు. కొడుకు తన సమీపానికి వచ్చిన ప్రతిసారి ఆమె కంగారుగా 'ష్! మాట్లాడకు' అన్నట్లు చూపుడు వేలు పెదవులకు నిలువుగా పెట్టుకుంటూ కళ్ళతోనే హెచ్చరిస్తూ ఉంది.

కొడుకు పిలుపుకు కూతురు లేచి ఏడవడం ప్రారంభిస్తే, ఆ శబ్దానికి ఇన్‌స్పెక్టర్‌కు నిద్ర భంగ మైతే తననెన్ని చివాట్లు పెడతాడో అనే ఆమెకున్న భయాన్ని గమనిస్తున్న ప్రభాకర్ హృదయం బాధతో మూలిగింది.

సంవత్సరాలుగా అదే స్టేషన్‌లో డ్యూటీ చేసి మరణించిన ఓ కాన్‌స్టేబుల్‌కు రావలిసిన డబ్బు గురించి మాట్లాడుదామని అతని భార్య గత కొన్ని రోజులుగా తిరుగుతూ ఉంటే ఇదా డిపార్ట్‌మెంట్ నుండి ఆమెకు లభిస్తున్న గౌరవం? ఛా! గలీజ్ డిపార్ట్‌మెంట్...అసహనంగా తిట్టుకున్నాడు.

పోలీసు శాఖలో కింది స్థాయి సిబ్బంది ఏదో సందర్భంలో తమ శాఖను తిట్టుకోవడం సహజం. కాకపోతే వ్యక్తిగతంగా తమకు అసంతృప్తి కలిగిన పుడే తిట్టుకుంటారు. కాని ఆ సమయం వ్యక్తిగ తంగా అతనికే మాత్రం నష్టం కలగకపోయినా ప్రభాకర్ తన డిపార్ట్‌మెంట్‌ను తిడుతున్నాడంటే కారణం లేకపోలేదు.

ఆ స్టేషన్‌లో సంవత్సరాలుగా కాన్‌స్టేబుల్‌గా డ్యూటీ చేసిన డేవిడ్ మూడు నెలల క్రితం మర ణించాడు. సిన్సియర్‌గా డ్యూటీ చేస్తూ తోటి జవా న్లతో మంచివాడిగా పేరు తెచ్చుకున్న డేవిడ్ ఆఫీస ర్లకు మాత్రం చెప్పులోని రాయిగా ఉండేవాడు. చెమ్చాగిరీ చేయడం అటుంచి...తోటి జవాన్‌కు ఏ మాత్రం అన్యాయం జరిగినా- ఆఫీసర్లను నిలదీసే అతనంటే కింది స్థాయి వారికి అభిమానంగా ఉంటే పై స్థాయి వాళ్ళకు అవమానంగా ఉండేది. సిన్సియ ర్‌గా డ్యూటీ చేసే అతన్ని ఏమి చేయలేక, కనీసం క్రమశిక్షణా రాహిత్యంలో కూడా ఇరికించలేక పోయిన ఆఫీసర్లు, ఆ కసిని అతను మరణించాక తీర్చుకోసాగారు. ఫలితంగా, మరణాంతరం అతని నామినికి రావల్సిన డబ్బు ఏదో లిటిగేషన్‌తో ఆగి పోయింది. అసలు కారణం తెలియని అతని భార్య మేరి - రోజూ డిపార్ట్‌మెంట్ చుట్టూ తిరుగుతూ ఉంది.

ఆ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఖమ్రొద్దీన్, డి.యస్పీ గంగాధర్ కుట్ర వలన ఆమెకు డబ్బులు రావ డంలో జాప్యమవుతుందని కొందరు సిబ్బందికి తెలిసి- డిపార్ట్‌మెంట్‌లోని క్రమశిక్షణకు సంకో చించి మవునంగా ఉండిపోతున్నారు. అలాంటి వాళ్ళలో ప్రభాకర్ ఒకడు. డేవిడ్‌పై ఉన్న కసి వలన సి.ఐ. ఖమ్రొద్దీన్ మేరిని హెరాస్‌మెంట్ చేస్తున్నా డని ప్రభాకర్‌కు తెలుసు. మేరీకి ఏదో విధంగా సహాయపడాలని అతని మనసులో ఉన్న, నిస్సహా యంగా ఉండిపోతున్నాడు.

ప్రభాకర్ ఒక్కడే కాదు. మేరీకి సహాయపడే విషయంలో అతనిలాంటి చాలామంది నిస్సహా యంగా ఉండిపోతున్నారంటే కారణాలు అనేకం....

పోలీసు శాఖలో చాలామంది ఆఫీసర్లకు ఓ మానసిక వ్యాధి ఖచ్చితంగా ఉంటుంది. కాన్‌స్టే బుళ్ళంటే సబార్డినేట్‌లు కాదు, తమ బానిసలని, వాళ్ళను చులకనగా చూడాలనే భావం నరనరాల్లో ఉండటమే ఆ వ్యాధి ముఖ్య లక్షణం.

ఆ వ్యాధి ఏ ఆఫీసర్లో ఎంతవరకు ముదిరి ఉంటుందో వాళ్ళ పరిధిలో డ్యూటి చేసే కాన్‌స్టే బుళ్ళ జీవితం అంత దుర్భరంగా ఉంటుంది. అయితే కొందరు కాన్‌స్టేబుళ్ళకు మాత్రం కొద్దిగా మినహాయింపు ఉంటుంది. అయితే అలాంటి కాన్ స్టేబుళ్ళకు కొన్ని అర్హతలు ఖచ్చితంగా ఉండాలి. ఆఫీసర్‌కు చెందిన మతం, కులం, ప్రాంతం వాడైన ఉండాలి లేదంటే అడుగులకు మడుగులొత్తే చెంచా అయినా అయివుండాలి. వీటిలో ఏ అర్హత ఉన్నా, ఆ కాన్‌స్టేబుళ్లు తమ స్థాయిలోని మిగిలిన వారి కంటే అన్ని విషయాల్లో సుఖంగా ఉంటారు.

పోలీసు శాఖలో క్రమశిక్షణ పెట్టడానికి మరో కారణం ఉన్నా, ఆ కారణాన్ని వక్రీకరిస్తూ చాలా మంది ఆఫీసర్లు తమ స్వంత భాష్యాన్ని దానిపై అద్ది కింది స్థాయి వారిని హీనంగా చూస్తారు. అమ ర్యాదగా మాట్లాడుతారు.

ఆఫీసర్ల ప్రవర్తన అలా ఉన్నా కూడా చాలా మంది కిందిస్థాయి వారు ఎదురు తిరిగి మాట్లాడక పోవటానికి ఎన్నో కారణాలున్నాయి. ఆఫీసర్లు బూతులు ఉపయోగిస్తూ నీచంగా మాట్లాడితే, కింది స్థాయి వారిని కంట్రోల్లో పెట్టడానికి ఉపయో గించిన క్రమశిక్షణ కిందికి వస్తుంది. తమకు జరిగిన అన్యాయాన్ని, అవమానాన్ని కిందిస్థాయి వారు ప్రశ్నిస్తే అది క్రమశిక్షణ ఉల్లంఘన కిందికి వస్తుంది. ఆఫీసర్ల అన్యాయాల్ని ప్రశ్నించే హక్కు కిందిస్థాయి వారికి ఉండదు. ఏ ఒక్కరైనా ఎదురు తిరుగు దామా అని అనుకుంటే అతనికి సపోర్ట్‌గా నిలవడా నికి క్రిందిస్థాయి వాళ్ళకు యూనియన్ ఉండదు. అదే గనుక ఆఫీసర్‌కు ఏ విషయంలోనైనా అన్యాయం జరిగితే సపోర్ట్‌గా నిలబడటానికి వాళ్ళకు మాత్రం అసోషియేషన్ ఉంటుంది.

ఈ నగ్న సత్యాన్ని గ్రహించే చాలామంది కాన్ స్టేబుళ్ళు ఆఫీసర్లకు చెంచాగిరి చేయడానికి సిద్ధ మయి పోతారు. అలా చేయడానికి ఇష్టపడని వాళ్ళు పనిష్మెంట్‌లాంటి డ్యూటీల్లో మగ్గుతూ ఉండిపోతారు.

ఎలాంటి డ్యూటీ అయినా సిన్సియర్‌గా చేయాలే తప్ప ఆఫీసర్లుకు చెంచాగిరీ చేయకూడద నుకొనే కొంతమంది కాన్‌స్టేబుళ్ళలో ప్రభాకర్ కూడా ఒకడు. ప్రభాకర్ అసహనంగా సి.ఐ. గది వైపు చూసాడు. సి. ఐ గాఢనిద్రలో ఉన్నాడేమో ఏయిర్‌కూలర్ శబ్దాన్ని డామినేట్ చేస్తూ అతని గుర కలు వినిపిస్తూ ఉన్నాయి.

ప్రభాకర్ -మేరి వైపు జాలిగా చూస్తూ ఏదో చెప్పబోయేంతలో స్టేషన్ ముందు ఏదో వాహనం ఆగుతున్న శబ్దాన్ని విని రివ్వున ఆ వైపు చూసాడు. డి.యస్పీకు చెందిన టాటా సుమో కనిపించింది. ప్రభాకర్, సి.ఐకు ఆ విషయం చెప్పడానికి ఉద్యుక్తు డవుతూ, టాటా సుమోలోంచి డ్రయివర్ నజీబ్ ఎవరు లేరన్నట్లు సైగ చేయడంతో తన ప్రయ త్నాన్ని ఆపుకున్నాడు.

డి.యస్పీ డ్రయివర్ నజీబ్‌ను చూడగానే ప్రభా కర్ నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు. 'నిద్రలోంచి ఎప్పుడు లేస్తావురా నా కొడుకా!' సి. ఐను ఉద్దే శిస్తూ మనసులోనే తిట్టుకున్నాడు. అతను అలా అనుకోవడానికి కారణం లేకపోలేదు.


పోలీసు శాఖలో చాలామంది ఇన్‌స్పె క్టర్లు తమ చేతి క్రింద డ్యూటీ చేసే కాన్‌స్టేబు ళ్ళను ఎంత చులకనగా చూసినా తమ పై అధి కారుల డ్రయివర్లను (వాళ్లు కూడ కాన్‌స్టే బుళ్ళే అని తెలిసి కూడ) చులకనగా చూసే సాహసం చేయ (లే)రు. తమ సుపిరి యర్ ఆఫీసర్‌లకు పర్స నల్ స్టాఫ్ అయిన ఆ డ్రయివర్లు ఏదో ఒక టైంలో తమకు పనికొ స్తారు అన్న ఉద్దేశ్యంతో వాళ్ళను గౌరవంగా చూస్తారు. అంతేకాకుండా ప్రతినెల కొంత డబ్బు బహుమానంగా ఇస్తుం టారు. ఆ డ్రయివర్లు కూడా ఇన్‌స్పెక్టర్లకు విధేయు లుగా నడుచుకుంటారు. తాము డ్యూటీలు చేస్తున్న ఆఫీసర్లు దగ్గర ఏదో విధంగా సేకరించి ఇన్స్పెక్ట ర్లుకు కావలసిన సమాచారం, పనికొచ్చే ఇన్‌ఫర్మే షన్ అందచేస్తూ ఉంటారు. అందుకే అలాంటి డ్రయివర్లు వస్తే, తామెంత బిజీగా ఉన్న సరే ఇన్ స్పెక్టర్లు కొంత టైం వాళ్ళకోసం కేటాయిస్తారు.

నజీబ్ కూడ అలాంటి ఒక డ్రయివరే! ఆ సంగతి ప్రభాకర్‌కు తెలిసే ఇక సి.ఐ నిద్రలోంచి లేస్తాడని ధీమాగా అనుకున్నాడు.

''ఏం ప్రభాకరన్న.. బోణీ అయిందా, లేదా?'' నజీబ్ లోనికి వస్తూ నవ్వుతూ ప్రభాకర్‌ను పలుక రించాడు.

''పహారాలో ఉంటే బోణీ ఏమవుతుంది భాయ్? పెట్రోలింగ్ తిరుగాలే గాని...'' ప్రభాకర్ నవ్వుతునే అన్నాడు.

పోలీసు శాఖలో చాలామంది ఆఫీసర్లకు ఓ మానసిక వ్యాధి ఖచ్చితంగా ఉంటుంది. కాన్‌స్టేబుళ్ళంటే సబార్డినేట్‌లు కాదు, తమ బానిసలని, వాళ్ళను చులకనగా చూడాలనే భావం నరనరాల్లో ఉండటమే ఆ వ్యాధి ముఖ్య లక్షణం.




''ఆ బోణీ కోసమే నేనూ పెట్రోలింగ్ చేస్తున్నాను... మీ సార్ రమ్మన్నాడు. ఏం చేస్తున్నాడు?''

''నువ్వొచ్చావు కదా! ఇక లేస్తాడు...అదృష్టమంటే నీదే భాయ్. మా సార్ జనాల దగ్గర మామూళ్ళు గుంజుతాడులే నువ్వేమో మా సార్ దగ్గర మామూళ్ళు తీసుకుంటావు.'' పరిహాసంగా అన్నాడు.

''మీ సార్ అంత అమాయకుడేం కాదన్నో... మనం డి.యస్పీ రైట్ హ్యాండ్ కదా! ఎప్పుడు ఎక్కడ ఏ పుల్ల పెడుతానో అని ప్రసన్నం చేసుకునేందుకు ఇస్తాడ్లే... కుంభకర్ణుడిని లేపుతా...'' నవ్వుతూ అంటూ నజీబ్ సి.ఐ గదివైపు నడిచాడు.

''వచ్చిందెవరన్నా? సార్ నిద్రలోంచి లేస్తాడా?'' మేరి ఆశగా అడుగుతుంటే ప్రభాకర్‌కు టక్కున ఆలోచన వచ్చింది. నజీబ్ ద్వారా డి.యస్పీకు రెకమెండ్ చేయించి మేరికు సహాయపడవచ్చు ఆలోచన రాగానే సంతృప్తిగా తల ఊపాడు.

***

నజీబ్ నడుపుతున్న టాటా సుమో నెమ్మదిగా డియస్పీ క్వార్టర్స్ వైపు వెళుతుంది. అతని ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి.

అంతకు ముందు పదినిమిషాల క్రితం ప్రభాకర్, మేరిని పరిచయం చేసి ఆమెకు సహాయ పడాల్సిందిగా నజీబ్‌ను అభ్యర్థించాడు. ఆమె అందాన్ని చూడగానే అతనిలో ఓ వక్రమైన ఆలోచనకు అంకురార్పణ జరిగిపోయింది. మేరీకి తాను సహాయపడగలడో లేడో గాని ఆమెను ఉపయోగించుకొని డియస్పీ ద్వారా తనకు కావల్సింది పొందగలడని ఆమెలోని అమాయకత్వాన్ని గ్రహించాక అతనికి అర్థమయిపోయింది. అందుకే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆమెకు సహాయ పడ్తానని ప్రభాకర్‌కు మాట ఇచ్చేసాడు. ఆ క్షణం నుండి అతని ఆలోచనలు మేరి చుట్టే తిరుగుతున్నాయి.

నజీబ్‌కు తన ఉద్యోగం, జీతం, పై సంపాదన సంతృప్తిగానే అనిపిస్తున్నా అతని మనసులో గత కొన్ని నెలలుగా ఓ వెలితి ఉంది. మనసులో ఎలా పుట్టిందో తనకే తెలియదు గాని ప్రభుత్వం నుండి 'సేవా పతకం' పొందాలనే ఆలోచన అతనిలో పుట్టి అది దినదినాభివృద్ధి చెందుతూ వస్తూ ఉంది. అతనికి యోగ్యత లేకపోయిన పతకానికై అడ్డదారుల్లో ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాడు. డి.యస్పీ మంచి మూడ్‌లో ఉన్నప్పుడు ఆ విషయాన్ని ప్రస్తావించాడు కూడ.

''నువ్ నాకు సరిగ్గా సేవ చేయ్‌రా భయ్! అప్పుడు నీ సేవా పతకం గురించి ఆలోచిద్దాం'' డి.యస్పీ నర్మగర్భంగా చెప్పి ఉండటంతో అతన్ని సంతృప్తిపరిచే దారుల కోసం కూడా వెదుకుతూ వస్తున్నాడు నజీబ్.

సరిగ్గా అటువంటి సమయంలో తనకు సహాయపడమని మేరి అతనితో కలిసింది. డీయస్పీకి సేవ చేయడానికి అంతకంటే మంచి అవకాశం రాదని అతనికి అర్థమయిపోయింది.

మేరి లాంటి అందెగత్తెను ఏదోవిధంగా మభ్యపెట్టి ముసలి డి.యస్పీ పక్కలోకి పంపిస్తే, సంతృప్తిపడే డి.యస్పీ ఏదోవిధంగా తనకు 'సేవాపతకం' ఇప్పించగలడనే బలమైన నమ్మకం నజీబ్‌లో పాతుకుపోయింది. మేరిని ఏ విధంగా బుట్టలో దింపాలా ఆలోచిస్తూనే సుమోను నడుపుతు డి.యస్పీ క్వార్టర్‌కు చేరుకున్నాడు.

***

టాటా సుమో టైర్లను కడుగుతూ ఉన్న నజీబ్ దృష్టి- కొద్దిదూరంలోంచి ఒంటరిగా నడిచి వస్తున్న మేరిపై పడింది. అతని కళ్ళలో ఓ విధమైన సంతృప్తి వచ్చేసింది.

''నమస్తే అన్నయ్య'' మేరి అతని సమీపంగా వచ్చి వినయంగా అంది.

డియస్పీ ఇంటికి వస్తే ఆయనతో కలిపించి పని జరిగేట్లు చూస్తానని నజీబ్ ఆమెతో చెప్పి ఉండటంతో ఎంతో ఆశగా మేరి అక్కడికి వచ్చింది.

''రా! మేరి నీగురించే ఆలోచిస్తున్నాను...నిన్న రాత్రే డేవిడ్ గురించి మా డియస్పీతో మాట్లాడాను. కాని ఆయన పట్టించుకోవడం లేదు.'' టైర్లను కడగడం ఆపి నిరాశ నటిస్తూ అన్నాడు.

''అన్నా. నువ్ తల్చుకుంటే ఈ పని సులభంగా అవుతుందని ప్రభాకరన్న చెప్పాడు. పేదదాన్ని కాస్త కనికరం చూపించు అన్నా...'' దీనంగా అంది.

''నిజం మేరి. నా ప్రయత్నమంతా నేను చేసాను. డి.యస్పీ నా కొడుకు పట్టించుకోవడం లేదు. పైగా ఈ పని చేయిస్తే నాకేం లాభం అని నిర్లక్ష్యంగా అంటున్నాడు.'' కొద్దిగా ఆవేశం నటిస్తూ అన్నాడు.

మేరి వదనం తెల్లగా పాలిపోయింది.

''మా ఆయన డబ్బులు వచ్చాక అందులోంచి ఆయనగారు అడిగింది ఇద్దాం'' గాద్గదికంగా అంది.

''మాసార్ డబ్బులే ఆశించి ఉంటే ఆ డబ్బు నేను ఇచ్చి తర్వాత నీ దగ్గర తీసుకొనేవాడిని.. కాని, ఆయనకు కావల్సింది డబ్బు కాదు.. నీకెలా చెప్పాలో అర్థం కావడంలేదు గాని చెప్పకుండా కూడా ఉండలేను. ఎందుకంటే అవసరం నీది..''

''డబ్బులు కాకుంటే మరీ ఆయనకు ఏం కావాలి?'' నజీబ్ మాటలకు అడ్డుపడుతూ సంశయంగా అంది.

నజీబ్ కొన్ని క్షణాలు మౌనంగా ఉండి పరిసరాలను నిశితంగా గమనించాక భారంగా నిట్టురుస్తూ ''చెప్పడానికి నాకే ఎలాగో అనిపిస్తుంది కాని చెప్పక తప్పదు...నువ్వు ఒక గంట ఆయనతో గడిపితే చాలట! రావలిసిన డబ్బే కాదు. నీకు ఉద్యోగం కూడ వచ్చేట్లు చూస్తాడట...'' ఆవేదన నటిస్తూ అన్నాడు.

మేరి దిగ్భ్రాంతిగా నోరు తెరిచేసింది. ఆమె మనసు స్తబ్దుగా మారిపోయింది.

ఆమెకు ఆలోచించుకోవడానికి సమయం ఇస్తున్నట్లుగా అతను సుమో టైర్లు కడుగుతున్నట్లు నటించసాగాడు. క్షణాలు గడుస్తున్న ఆమె మౌనంగానే ఉండటంతో అతనికి కాస్త ధైర్యం వచ్చింది. ఆమె మానసిక స్థితి పట్టించుకోకుండా అతను తన లౌక్యాన్నంతా ఉపయోగిస్తూ ఆమె పట్ల సానుభూతిని చూపుతూనే డి.యస్పీ దగ్గర ఓ గంట గడపడమే మంచిది అనేట్లుగా సలహాలు ఇవ్వసాగాడు.

డి.యస్పీని సుఖపెడితేగాని తన పనికాదు అన్న విషయం కంటే వాడి దగ్గర తనను తార్చడానికి నజీబ్ తెగ ప్రయత్నం చేస్తున్నాడని ఆమెకు అర్థమయిపోయింది.

''మేరి, డియస్పీ గారికి ఏం చెప్పమంటావు?'' నెమ్మదిగా అడిగాడు. అవసరం నీది. నీ యిష్టం అనే అర్థం ధ్వనించేట్టు.

''అన్నా. నా భర్త ఇలా అర్థాంతరంగా పోతాడని నేనే రోజు ఊహించలేదు. మనం ఊహించంది జరిగేదే జీవితమేమో! నువ్వు ఊహించకపోవచ్చు గాని నువ్వు కూడ అరాంతరంగా మరణించవచ్చేమో! నువ్వు పోయాక నీకు రావలసిన డబ్బుల గురించి నీ భార్య కూడా నాలాగే తిరుగుతుందేమో! ఆ సమయంలో నీలాంటి ఆపద్బాంధవుడు ఎవరో ఆమెకూ తగలవచ్చేమో...'' తనలోని ఉక్రోషాన్ని ఆవేశాన్ని అతి కష్టంగా అణుచుకుంటు మేరి శాంతంగా అంది.

ఆమె మాటల్లోని భావం అర్థం కాగానే నజీబ్ దవడ బిగుసుకుంది. ''మేరి'' ఆవేశంగా అన్నాడు.

''కోపం వచ్చిందా అన్నా...వచ్చిందేమో! పర పురుషుడి దృష్టి పడకూడదని భార్యను నిండుగా

బుర్ఖా ధరింపచేసే నీకు, నీ భార్య కూడ నాలాంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది అన్న. నా ఉసురుకు- కోపం రాకుండా ఉంటుందా? ..నీతోటి కానిస్టేబుల్ భార్యను ఆఫీసర్ దగ్గర తార్చాలనుకుంటున్నావు. నాలాంటి పరిస్థితే రేపు నీ భార్యకు కూడ రావచ్చేమో అనీ ఎందుకనుకోవూ?...నాలాంటి అభాగ్యురాళ్ళ జీవితాలతో ఆడుకొనే ప్రయత్నం చేయకు. ఉసురు తగిలిందా రేపు నీ భార్యకు కూడా ఇదే గతి పడుతుంది...'' ఆవేశంగా అని మేరి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

నజీబ్ నోరు తెరిచేసి దిగ్భ్రాంతిగా ఆమె వెళ్ళిన వైపే చూస్తుండిపోయాడు.

***

సాయంత్రం నాలుగవుతోంది.

మఫ్టీలో ఉన్న డి.యస్పీ పరిసరాలను గమనిస్తూనే మేరి ఇంటి తలుపు కొట్టాడు. లోపలి నుండి ఎలాంటి రెస్పాన్స్ రాలేదు.

''సార్. మేరి తలుపు తీయదు. మీరే లోనికి వెళ్ళాలి. మిమ్మల్ని చూసి ఆమె కంగారుపడినట్లు నటిస్తుంది. మీరే మాత్రం కంగారు పడకుండా ఆమెను బుజ్జగిస్తూ లొంగదీసుకోవాలి...అలా చేయమని మేరి నాతో చెప్పింది.'' అన్న తన డ్రయివర్ నజీబ్ మాటలు గుర్తుకురావడంతో తలుపులు నెట్టుకొని డి.యస్పీ ఇంట్లోకి వెళ్ళాడు ధైర్యంగా.

అతన్ని చూడగానే మేరి కంగారుగా నిలబడింది. ''సార్ మీరా? ఇక్కడికెందుకు వచ్చారు?'' భయంగా అడిగింది.

''మేరి అలాగే నటిస్తుంది. మీ కోరికేమిటో మీరే స్వయంగా చెప్పాలి.'' నజీబ్ మాటల్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ డి.యస్పీ ధైర్యంగా తన కోరికేమిటో అది తీర్చడం వలన ఆమెకు కలిగే లాభాలేమిటో బుజ్జగిస్తూ చెప్పసాగాడు. అంతావిన్నాక మేరి తన కాలి చెప్పు తీసుకుని అతన్ని వాయించసాగింది.

''నీయమ్మా...'' బూతులు తిడుతూ డి.యస్పీ ఆమె చీర లాగుతుంటే...''డియస్పీగారు ఇక మీ ప్రతాపం ఆపండి'' అన్న మాటలు విని అతను కంగారుగా అటూ ఇటూ చూసాడు.

చేతుల్లో వీడియో కెమేరాలతో నలుగురు రిపోర్టర్లు ప్రక్కగదిలోంచి బయటికొస్తూ కనిపించారు.

తలపై బాంబు పడినట్టు డియస్పీ అదిరిపడ్డాడు. పరిస్థితి అర్థం కాగానే గజగజ వణకసాగాడు.

''అది కాద్సార్. సాక్షాత్తూ హోం మంత్రిగారు కూడా మా న్యూస్ ఛానల్లో మీ మాటలు వింటారు.'' వాళ్ళంతా ముక్తకంఠంతో వ్యంగ్యంగా అంటూ బయటికి వెళ్ళసాగారు. డియస్పీ వాళ్ళను అభ్యర్థిస్తూ వెనకే వెళ్ళసాగాడు.

మేరి ఆ వైపు సంతృప్తిగా చూస్తుండిపోయింది.

మేరి మాటలకు తనలోని మానవత్వం మేల్కొనడంతో క్రితం రోజు నజీబ్ వచ్చి ఆమెతో కలిసి క్షమాపణలు కోరాడు. ఆ డియస్పీ ఉన్నంత వరకు ఆమెకు న్యాయం జరగదని చెప్పి..డియస్పీను ఇరికించే పథకం చెప్పి ఆమెను ఒప్పించి తెర వెనుక తాను ఉండి ఆ పథకాన్ని విజయవంతం చేసాడు.

మేరి నెమ్మదిగా బయటికొచ్చి నజీబ్ కనిపిస్తాడేమోనని ఆతృతగా, ఆశగా చూడసాగింది.

ఆ క్షణం ఆమె కళ్ళలోని భావాలను నజీబ్ చూసి ఉంటే, ప్రభుత్వ సేవా పతకం పొందడంలోని తృప్తి కంటే రెట్టింపు తృప్తి పడేవాడు.

★

నేములోనే అంతా వుందనుకుందో ఏమో సమీరారెడ్డి తన పేరులోని మధ్య అక్షరాలకు ఉద్వాసన చెప్పి ఎంచక్కా సామ్ గా మారింది. సిన్మాల్లో బట్టలు విప్పుకుని బయట కొచ్చిన జలకన్యలా కన్పించే సామ్ హఠాత్తుగా కాటన్‌చీరల్లో దర్శనమిస్తూ నిరాశపరుస్తోంది. దీనిక్కారణం అంతా తనకి జ్ఞానోదయం అవటమే అంటుంది. నిన్నటిదాకా తనమీద తనకు కంట్రోల్ లేకుండా వుండట. ఇప్పుడు తనని తను అదుపులో వుంచుకునే బుద్ధిమంత తనం వచ్చేసిందట. హౌరా! రోజులు కలిసి వచ్చాయో ఏమో మంచి సినిమాలు మంచి మంచి హీరోలతో కొట్టేసింది. అయితే తను ఇప్పటిదాకా చూపించిన దానికి(?) ఇకనుంచి చూపబోయే వాటికి సహస్ర తేడా వుంటుందంటూ వూరిస్తోంది. (అసలు చూపించడానికి ఏం మిగిలింది అని అడక్కండి.) సినీ ప్రపంచంలోఅడుగెట్టిన వాళ్లందరూ శరీరం చూపించుకుని పైకొచ్చినవాళ్లే అంటూ తనని తను సమర్థించుకుంటుంది. టాక్సీ నెంబర్ నౌ దో గారహ్...' లో జాన్ అబ్రహంతో కెమిస్ట్రీ బాగా కుదిరిందట. ఎలా అని అడిగితే 'నా ఎత్తు జాన్ ఎత్తు, శరీరాలు బాగా కుదిరాయి' అంటూ కులుకుతోంది. మరి ఇది వింటే బిపాసా వూరుకుంటుందా అని అడిగితే... అందుకే నా లిమిట్స్‌లో నేనుంటున్నాగా! అంటోంది. అంతే కాదు తనకెవరిమీదా ఆశ లేదంటోంది. ప్రస్తుతం మగ హీరోలందరూ ఎంగేజ్ అయి వున్నారని నిట్టూర్పుతోంది.

హా...సమీరా రెడ్డి...కాదు.. సామ్.

